పల్స్ పోలియో విజయవంతం

నేడు కూడా పోలియో చుక్కలు వేసేందుకు తగిన ఏర్పాట్లు


శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జగదీశ్వర్‌గౌడ్..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందర్ తెలిపారు. మండల పరిధిలో 74,595 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయాలన్న లక్ష్యం ఉండగా.. 71,327 (95 శాతం) మంది చిన్నారులకు వేసినట్లు వివరించారు. అదే విధంగా సోమ, మంగళవారాల్లో కూడా వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయించుకుని చిన్నారులను గుర్తించి వేస్తారన్నారు. శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతినిధి డాక్టర్ వర్షిణి పరిశీలించారు. మండల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం ఎలా నిర్వహిస్తున్నారో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందర్‌ను అడిగి తెలుసుకున్నారు. పల్స్ పోలియో నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేసినట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

◆ పల్స్ పోలియో కార్యక్రమం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించారు. ఉదయం నుంచి 0–5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. శేరిలింగంపల్లి పరిధిలోని కొండాపూర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్‌లోని వివిధ కాలనీలు, బస్తీలలో 73,624 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుని అధికార యంత్రాంగం పనిచేసింది. శేరిలింగంపల్లి అన్ని చోట్లా ఈ పోలియో చుక్కలు వేసేందుకు కేంద్రాలను నిర్వహించారు. చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలనే సంకల్పంతో అధికారులు రైల్వేస్టేషన్లు, ప్రదాన కూడళ్లు, బస్టాప్‌లలో కూడా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసిన చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఈ కార్యక్రమం సాఫీగా సాగిందని అధికారులు తెలిపారు. సోమ, మంగళవారాల్లో కూడా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చిన్నారుల గురించి ఆరా తీసి పోలియో చుక్కలు వేయని వారికి వేసేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.


కల్వరి టెంపుల్‌లో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ సృజన


మియాపూర్‌లో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

‘నిథమ్’కు మంచిరోజులు వచ్చేనా ?

రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి పరిశీలనతో నూతన ఉత్సాహం

ఉద్యోగులు, అధికారులంతా సమిష్టిగా ఇన్‌చార్జి డైరెక్టర్‌కు సహకరించేందుకు సిద్ధం

రాయదుర్గం: పర్యాటక, ఆతిథ్య కేంద్రంగా, విద్య, శిక్షణా సంస్థగా గుర్తింపు పొందిన గచ్చిబౌలిలోని ‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)కు ఇక మంచి రోజులు వచ్చేనా..? అనే ప్రశ్నకు జవాబు కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక శాఖ డైరెక్టర్, నిథమ్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ నిఖిల, ఇతర అధికారులు ‘నిథమ్’ క్యాంపస్‌ను సందర్శించారు. అంతకు ముందు ముఖ్యంగా నిథమ్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, పర్యాటక శాఖ డైరెక్టర్, టీఎస్‌టీడీసీ ఎండీ డాక్టర్ నిఖిలారెడ్డిని తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

◆ తాత్కాలిక బాధ్యతలు చేపట్టే డైరెక్టర్‌కు పూర్తి స్థాయిలో సహకరించాలని అందరూ సమిష్టిగా నిర్ణయించుకోవడం శుభపరిణామంగా కనిపిస్తోంది. ముఖ్యంగా దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఈ నిథమ్‌ను సాక్షాత్తు కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రారంభించడంతో ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ‘నిథమ్’కు ఇక అన్నీ మంచిరోజులే వస్తాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్

పర్యాటక శాఖామంత్రి సందర్శనతో..

రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా పర్యాటక అధికారులతో కలిసి ‘నిథమ్’ క్యాంపస్‌ను సందర్శించారు. దీంతో అందరిలోనూ నిథమ్‌కు పూర్వవైభవం రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా క్యాంపస్‌లో ఆహ్లాదపూరిత వాతావరణం, గ్రీనరీ, ఆంఫీథియేటర్, శిల్పాల పార్కు, రోడ్లు, శతాబ్దాల చరిత్ర కలిగిన క్యాంపస్‌లోని రామమ్మకుంట చెరువును ఆయన పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి క్యాంపస్‌లోని అన్ని బ్లాకులు, తరగతి గదులు, బోధనా విధానం వంటివి స్వయంగా పరిశీలించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, అధికారులతో కలిసి పలుప్రశ్నలు వేసి వారి నుంచి సమస్యలు, ఇతర అంశాలను తెలుసుకున్నారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి నివేదిక అందిన తర్వాత తగిన చర్యలు తీసుకోవాలని తాత్కాలికంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం దృష్టి పెట్టేనా..

నిథమ్‌లో గత రెండేళ్లుగా కొనసాగుతున్న అనేక సమస్యలపై స్పష్టత వస్తుందా...? అనే ప్రశ్న నిథమ్‌లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిలో నిత్యం ఓ చర్చనీయాంశంగా మారింది. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమస్యలన్నీ తీర్చేలా చర్యలు ఉంటే, నిథమ్‌లో రూపొందించిన ప్రణాళికలన్నీ అమలుకు నోచుకుంటే ఆదర్శ జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్‌గా పేరు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రధానంగా ‘నిథమ్’కు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్న యూనివర్సిటీ హోదా వస్తుందా..? అనే అంశంతో పాటు అనేక ప్రశ్నలు అందరిలోనూ మెదలుతున్నాయి.

ఉచిత వైద్య శిబిరం


అంజయ్యనగర్‌లో ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: మారిన జీవనశైలిలో పర్యావరణ మార్పులతో అనేక వ్యాధులు సంభవిస్తున్నాయని ప్రముఖ వైద్యులు సద్గురు, విశ్వనాథ్‌లు సూచించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లోని శారదా హైస్కూల్‌లో హోలిస్టిక్ ఆస్పత్రి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు ఎత్తు, బరువు, రక్తపోటు, షుగర్, పల్స్, నేత్ర పరీక్షలు, ఈసీజీ మొదలగు పరీక్షలను నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోజూ వ్యాయామం, మెడిటేషన్, యోగా, ధ్యానం, నడక కనీసం 40 నిమిషాలు చేయాలన్నారు. తాజా ఆకుకూరలు, పండ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, గుడ్లు పౌష్టికాహారం, డ్రైఫ్రూట్స్ వంటివి తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాలకు ఆల్కహాల్, పొగాకు, పొగాకు ఉత్పత్తులకు కూడా దూరంగా ఉండాలని కోరారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. స్కూల్ కరస్పాండెంట్ బందా నరేంద్రబాబు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాలం శ్రీను, ఆస్పత్రి ప్రతినిధి శివ వైద్యబృందం, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

శేరిలింగంపల్లి: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన పలు కాలనీపరిధిలోని జయశంకర్‌నగర్, మహంకాళినగర్, శంషిగూడలకు చెందిన 300 మంది కాంగ్రెస్‌లో చేరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి పరిధిలో భారీ మెజారిటీ ఇస్తామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో శేరిలింగంపల్లి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. రాయపాటి వెంకటకృష్ణ, రమణ, కరుణాకర్, అనీల్, మహేష్, దుర్గ, గాఫోర్, దేవానాయక్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీధర్, నల్ల సంజీవరెడ్డి, మరేళ్ల శ్రీనివాస్, వీరేందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సాంబశివరావు, సంగారెడ్డి పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



హఫీజ్‌పేట్: లయన్స్ క్లబ్ హైదరాబాద్, హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4 కుటుంబాలకు ఆదివారం కుట్టు మిషన్లను హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అందజేశారు. స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా లయన్స్ క్లబ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్లబ్ ద్వారా ఇప్పటి వరకు ఎన్నో కుటుంబాలకు కుట్టు మిషన్లను అందించామన్నారు. భవిష్యత్తుల్లో క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. క్లబ్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, సాయి, మహేష్ తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి


గచ్చిబౌలి స్టేడియం వద్ద బీజేపీ మహిళా మోర్చా నారీశక్తీ వందన్ 3 కే రన్‌లో..

గచ్చిబౌలి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి సూచించారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నారీశక్తి వందన్ 3కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రన్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలకు సమన్యాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రంగంలో నేడు మహిళ పాత్ర కీలకంగా మారిందన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నారీశక్తీ వందన్ 3కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. మనదేశంలో మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడి ముందుకు సాగుతున్నారన్నారు. ప్రతి మహిళా ఒక శక్తి అని, వారికి అన్ని చోట్లా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పురుషులతో పాటు సమాన హక్కులు కల్పించి సమన్యాయం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నిర్ణయం మహిళలకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం ఈ రన్‌లో వందలాది మంది ఉత్సాహంగా పాల్గొనగా.. రంగురంగుల బెలూన్లను గాల్లోకి వదిలేశారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్పందన, రాష్ట్ర కార్యదర్శి గీత, జిల్లా నాయకులు వరలక్ష్మి, విద్యాపాండే, మాధవీలత, శివాసింగ్, గోపాల్ పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో ప్రణాళికాబద్ధంగా కాలనీలు, బస్తీలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్ జాగృతికాలనీలో కాలనీ అసోసియేషన్ కాలనీవాసుల ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఆయన కార్పొరేటర్లు హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దశలవారీగా కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్నిచోట్లా కమ్యూనిటీ హాల్స్, ఎంపిక చేసిన చోట్లలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్లను నిర్మించామన్నారు. కమ్యూనిటీహాళ్ల నిర్మాణంతో ఆయా కాలనీల్లో సమావేశాలు, సభలు, చిన్నచిన్న ఫంక్షన్లు, జన్మదిన వేడుకలను నిర్వహించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వీటిని స్థానికులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి కాలనీ, బస్తీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఇప్పటికే తగిన చర్యలు ప్రారంభించామన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుపతి, శ్రీనివాస్, జాగృతి కాలనీవాసులు రామకృష్ణ, వాసు, చంద్రశేఖర్, రతన్, శ్రీనివాస్, అమర్‌తేజ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవం


మాస్టర్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల హుడా కాలనీలో ఏర్పాటు చేసిన మాస్టర్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే స్కూళ్లకు ప్రజల నుంచి ఎప్పుడూ.. ఆదరణ ఉంటుందన్నారు. రాష్ట్ర యువనాయకులు అనిరుద్ యాదవ్, అభిషేక్ యాదవ్, స్కూల్ చైర్మన్ రాజు, డైరెక్టర్స్ సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, హరిబ్రహ్మం, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి పూజల్లో భాగంగా రామలింగేశ్వర దేవస్థానం, మహాదేవుని ఆలయం, ఉమామహేశ్వర దేవస్థానంలో సోమవారం ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. మధ్యాహ్నం శివస్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆయా ఆలయాల అర్చకులు మహేష్, ఓంకార్లు తెలిపారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో రూల్లో) టమాట రూ.20, పచ్చిమిర్చి 60, బెండకాయ 60, కాకర 60, దొండ 40, దోసకాయ 30, ఆలుగడ్డ 25, చామ 60, కీర 30, బీరకాయ 60, వంకాయ 40, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ రూ.40, చిక్కుడు 70, ఉల్లిగడ్డ రూ.25 (కేజీ), ములక్కాయలు (2)10, కాలీఫ్లవర్ (1) 40, సొరకాయ కిలో రూ.20, అల్లం రూ.150, వెల్లుల్లి రూ.300గా ఉన్నాయి.

అలరించిన కూచిపూడి నృత్యం


శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకున్నాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెంపటి వెంకట నారాయణ నృత్య కళాక్షేత్రం గురువు డాక్టర్ వెంపటి శ్రావణి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. శ్రీ విఘ్నరాజం భజే, చంద్రచూడ శివశంకర, శ్రీరామచంద్ర కృపాలు, తరంగం, భోశంభో, శివ స్తుతి, అన్నమాచార్య కీర్తన, బోనాలు, బృందావన సారంగి తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు విజయ్ కిరణ్మయి, రియా, సన్మయి, నైతిక, కార్తీన్య, రుషిక, మాన్విక, శ్రీహిత, సంవేద్య, ఆస్విత తదితరులు పాల్గొన్నారు.

యువత మంచిమార్గంలో నడిచేలా చర్యలు

నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు గ్రహీత శ్రీదేవి దేవిరెడ్డి


సమావేశంలో పాల్గొన్న యువతీయువకులు

రాయదుర్గం: యువత మంచి మార్గంలో నడిచేలా చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు గ్రహీత శ్రీదేవి దేవిరెడ్డి సూచించారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీలో హైదరాబాద్ యూత్ అసెంబ్లీ, స్ట్రీట్ కాజ్ అనే జాతీయ స్థాయి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో యువతీయువకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేలా.. వారిలో అవగాహన కలిగేలా చొరవ తీసుకోవాలన్నారు. స్వచ్ఛంధ సంస్థలు తమ లక్ష్యాలను సాధించుకునేందుకు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్యం, స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్యం, ఆర్థికవృద్ధి, ఆకలి నివారణపై చొరవ తీసుకోవాలని హెచ్‌వైఏ పని చేయడం అభినందించాల్సిన విషయమన్నారు. ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహించాలన్నారు. ప్రజల్లో ప్రస్తుత పరిస్థితుల్లో అనేక రకాల సమస్యలు ఎదురౌతున్నాయని, వాటి పట్ల తగిన జాగ్రత్తలు చేపట్టేలా స్వచ్ఛంధ సంస్థలు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి అంశంపై యువత, ప్రజల్లో అవగాహన పెంచేందుకు అందరూ ముందుకురావాలన్నారు. అనంతరం ఐక్యరాజ్యసమితి నిర్ధారించిన స్థిరమైన లక్ష్యాలతో అత్యంత ప్రధానమైన అంశాలైన ఆరోగ్యం, స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్యం, ఆర్థికవృద్ధి, అభివృద్ధి, ఆకలి నివారణ వంటి అంశాలపై యువత చర్చించారు. వీటన్నింటినీ ప్రభుత్వమే కాకుండా మనవంతు బాధ్యతతో కష్టపడి తీర్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌వైఏ ప్రతినిధులు మానస్‌రెడ్డి, మణితేజ, ఇతర సభ్యులు, 150 మంది యువతీయువకులు పాల్గొన్నారు.

అధునాతన సౌకర్యాలతో మున్సిపల్ కార్యాలయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అధునాతన సౌకర్యాలతో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నిర్మించామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లో నూతనం నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి మున్సిపల్ పరిధిలో ఆధునిక సౌకర్యాలతో మున్సిపల్ కార్యాలయ భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. తెల్లాపూర్‌లో రూ.10కోట్ల అంచనాతో మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మించామన్నారు. దానిని త్వరలో ప్రారంభిస్తామని వివరించారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల కోరిక మేరకు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. అనంతరం మున్సిపల్ భవన మ్యాప్‌ను పరిశీలించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

మియాపూర్: నిషేధిత గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను మియాపూర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని గోకుల్‌ప్లాట్స్‌లో గంజాయి క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు మియాపూర్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. అనుమానంగా గోకుల్ ప్లాట్స్‌కు చెందిన ఎస్ వంశీకృష్ణ (26), వెంకటేష్(25)లను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా.. వారి వద్ద 2.5 కేజీల ఎండు గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారిని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా.. విశాఖపట్నం నుంచి గత నెల రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి గోకుల్‌ప్లాట్స్ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో క్రయవిక్రయాలు చేస్తున్నట్లు అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్


కేంబ్రిడ్జి స్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌లో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్


మైత్రి హైస్కూల్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మైత్రి హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు స్కూల్ స్థాయి నుంచే టెక్నికల్‌గా అభివృద్ధి చెందేందుకు సైన్స్ ఫెయిర్లు దోహదపడతాయన్నారు. సమాజానికి మేధావులు, శాస్త్రవేత్తలను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డైరెక్టర్ ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ రఘునందన్‌కుమార్, కరస్పాండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంబ్రిడ్జి స్కూల్‌లో సైన్స్ ఫెయిర్..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని కేంబ్రిడ్జి స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆదివారం ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న ఆలోచనలకు పదును పెట్టేందుకు సైన్స్ ఫెయిర్‌లు ఉపయోగపడుతాయన్నారు. స్కూల్ చైర్మన్ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

33 కేవీ విద్యుత్ టవర్‌ను ఢీకొట్టిన టిప్పర్

- పూర్తిగా ధ్వంసమైన టవర్ కింది భాగం
- విద్యుత్ సరఫరాకు ఆటంకం కలకుండా చర్యలు
- కొత్త టవర్ నిర్మాణానికి కసరత్తు ప్రారంభించిన విద్యుత్ అధికారులు


నల్లగండ్ల వద్ద ప్రధాన రోడ్డు పక్కన ధ్వంసమైన భారీ విద్యుత్ టవర్..

శేరిలింగంపల్లి: భారీ విద్యుత్ లైన్ టవర్‌ను ఢీకొట్టిన టిప్పర్‌తో టవర్ కింది భాగం ధ్వంసమైంది. విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు చేపట్టారు. కొత్త టవర్ నిర్మాణం పూర్తి చేసి దానికి 33 కేవీ విద్యుత్ లైన్‌ను అనుసంధానం చేసిన తర్వాత ధ్వంసమైన టవర్‌ను తొలగించాలని అధికారులు నిర్ణయించారు. శనివారం నల్లగండ్లలోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న 33 కేవీ విద్యుత్‌లైన్ భారీ టవర్‌ను టిప్పర్ వెళ్ళి ఢీకొట్టింది. దీంతో టిప్పర్ కింది భాగం ధ్వంసం కాగా.. అది కాస్తా వంగి పోయింది, రోడ్డు రాకపోకలు సాగించే వారు కొద్ది సేపు భయాందోళనలకు గురైనా అధికారులు సకాలంలో స్పందించి ఈ టవర్ కిందపడిపోకుండా తగిన చర్యలు చేపట్టారు. ధ్వంసమైన టవర్ చెంతనే మరో కొత్త టవర్‌ను ఏర్పాటు చేసిన అనంతరం 33 కేవీ విద్యుత్ లైన్ కేబుళ్ళను అనుసంధానం చేసిన తర్వాత పాత టవర్‌ను పూర్తిగా తొలగించాలని విద్యుత్ అధికారులు నిర్ణయించారు. అధికారులు సకాలంలో స్పందించడంతో భారీ ప్రమాదం పెద్దది కాకుండా చర్యలు తీసుకోవడంతో ఎలాంటి సమస్య తలెత్తలేదు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: పేదల పాలిట వరంగా సీఎంఆర్ఎఫ్ ఆర్థికసాయం కలుగుతోందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన రూ.12.47 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేకుండా ఉండే వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. పేద, మధ్యతరగతి వారికి ఇది ఎంతో ఉపశమనంగా మారుతుందన్నారు. సీఎం సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ.. ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు, అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలుస్తుందన్నారు. ప్రజలంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శేరిలింగంపల్లిలోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కొండాపూర్, చందానగర్, మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్లలోని పలు కాలనీలకు చెందిన లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు.

తల్లి, కూతురు అదృశ్యం


మౌనిక, ఐలమ్మ

మియాపూర్: ఓ మహిళ కుమార్తెతో సహా అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం .. మియాపూర్, బాలాజీనగర్‌లో దాది, చిట్టరి ఐలమ్మ దంపతులు నివాసముంటున్నారు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 2న ఐలమ్మ కుమార్తె మౌనిక(9) తీసుకుని బయటికి వెళ్లిపోయింది. ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఐలమ్మ సోదరి చంద్రకళ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసును దర్యాప్తు చేస్తున్నారు.